క్లుప్తంగా

జానపద కళారూపాలపై హేమబాంధవికి డాక్టరేట్



యద్దనపూడి(మొవ్వ): మొవ్వ మండలం యద్దనపూడి గ్రామానికి చెందిన కైలా హేమ బాంధవికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకటస్వామి పర్యవేక్షణలో కృష్ణాజిల్లా దివిసీమ జానపద కళారూపాలు–ఒక పరిశీలన అనే అంశంపై తెలుగు, ప్రాచ్య భాషా విభాగానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ లభించినట్లు హేమ బాంధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. చిన్ననాటి నుంచి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుకుని, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన తనకు జానపద కళలపై ఉన్న మక్కువతో దివిసీమ జానపద కళారూపాలపై పరిశోధన చేసినట్లు ఆమె వెల్లడించారు.

విద్యార్థినికి అభినందన



జమీగొల్వేపల్లి(పామర్రు): మండల పరిధిలోని జమీగొల్వేపల్లి గ్రామంలోని కుమారి వల్లభనేని శోభ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని కొరివి ఊర్వ్య ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక అయిందని హైస్కూల్ హెచ్ఎం వాకాచిన సత్యనారాయణ పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంగళవారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థిని ఊర్వ్యను ఆయన అభినందించారు. ఈ ఉపకార వేతనం కింద ఊర్వ్యకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం వరకు మొత్తం నాలుగేళ్ల పాటు ప్రతి ఏడాది రూ.12వేల చొప్పున రూ.48వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఊర్వ్యకు శిక్షణఇచ్చిన ఉపాధ్యాయులు మరీదు సీతారామయ్య, గూడూరు శ్రీనివాస్, కాంతికిరణ్, బేతపూడి రఘు, విజయశ్రీలను హెచ్ఎం అభినందించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం



గుడివాడటౌన్: అగ్ని ప్రమాదాలు సంభవించి నష్టపోయేకన్నా అప్రమత్తంగా ఉండటం మంచిదని అగ్నిమాపక శాఖ అధికారి జె.ఆంజనేయులు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, వరలవీధిలోని ఇండియన్ గ్యాస్ గోడౌన్ కార్మికులకు మంగళవారం అగ్నిప్రమాదాలు సంభవించడానికి గల అవకాశాలను వివరించి, అవి సంభవించకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు వివరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు గోడౌన్‌లో గల అగ్నిప్రమాదాల నిరోధక వస్తువులు ఎలా ఉపయోగించాలనే దానిపై డెమో నిర్వహించారు. కార్యక్రమంలో పెట్రోల్‌బంక్ ఉద్యోగులు, సిబ్బంది, అగ్నిమాపక ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం



ముదినేపల్లిరూరల్: స్థానిక పోలీసుస్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఎస్ఐ షణ్ముఖ సాయి అంబేడ్కర్ జయంతి రోజున స్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రజలు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సిబ్బంది నిత్యం మజ్జిగ పంపిణీకి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బస్టాండ్ సమీపంలో చలివేంద్రం ఉండడంతో ప్రయాణికులకు, స్థానికులకు వేసవి ముగిసే వరకు మజ్జిగ పంపిణీ చేస్తామని చెప్పారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు



కానుకొల్లులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, ఇళ్ల స్థలాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, ఆరోగ్యశ్రీ , పింఛన్లు, వైఎస్సార్ చేయూత తదితర పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని చెప్పారు. మండలంలోని కానుకొల్లు గ్రామంలో సర్పంచ్ నాగదాసి థామస్, ఎంపీటీసీ పుట్టి మీనాకుమారి ఆధ్వర్యంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయలేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని చెప్పారు. పథకాలు ప్రతి గడపకూ అందుతున్నాయన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, వైస్ ఎంపీపీ ఆగస్తీ ఆదివిష్ణు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు చేబోయిన వీర్రాజు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, పుట్టి సత్యనారాయణ, శొంఠి వీరముసలయ్య, జంపన వీరబాబు, మెండా సురేష్, వైఎస్సార్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, మాజీ ఎంపీపీ ముంగర గోపాల కృష్ణ, పరింకాయల వెంకటేశ్వరరావు, బొమ్మనబోయిన వరప్రసాద్, ముంగర మల్లికార్జునరావు, గుడివాడ వీరరాఘవయ్య, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, పెరుమాళ్ల సత్యనారాయణ, ఎస్ఐ టి.రామకృష్ణ, కార్యదర్శి ఎస్‌వీ రాధిక తదితరులు పాల్గొన్నారు.

25న దేవాలయ భూముల కౌలు వేలం

పామర్రు: దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జమీగొల్వేపల్లి గ్రామంలోని దేవాలయ భూములకు ఈనెల 25న కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి కె.వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమీగొల్వేపల్లి గామంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానానికి సంపూర్ణ హక్కు భుక్తములు గల రీ సర్వే నం.81/1లో 5.14 ఎకరాలు, రీ సర్వే నం.81/3లో 5.00 ఎకరాలు, రీ సర్వే నం.81/3లో 3.21 ఎకరాలు, రీ సర్వే నం. 81/3 లో 2.00 ఎకరాలు, రీ సర్వే నం.81/3లో 2.00 ఎకరాలు, రీ సర్వే నం.81/3లో 1.07 ఎకరాలు, రీ సర్వేనెం. 304/2లో 2.00 ఎకరాల వెరసి మొత్తం 20.42 ఎకరాల మాగాణి భూమి ఉందని అన్నారు. ఇవి కాక సత్రంలో రెండు పోర్షన్ల ఇల్లు, మఠంలోని 2 షాపులు ఉన్నాయన్నారు. ఈ భూములకు, ఇళ్లకు 3 సంవత్సరాల కాలపరిమితికి లీజు హక్కుకు అనగా 2023–24 నుంచి 2025–26 వరకు భూమిలో వ్యవసాయానికి సంబంధించిన పంట వేసుకొను కౌలు హక్కుకు, వ్యాపారము చేసుకోవటానికి ఈనెల 25వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక స్వామివారి ఆలయంలో కౌలు వేలం నిర్వహిస్తామన్నారు.

2,800 మందితో ఉపాధి హామీ పనులు

పామర్రు: మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీలలో 2,800 మందితో ఉపాధి హామీ పనులు నిర్వహించామని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో పోలు రాజు తెలిపారు.మండల పరిధిలోని పోలవరం గ్రామంలో జరుగుతున్న చెరువు తవ్వకం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులో మట్టిని తీసి గట్లు భద్రపరిచే చెరువు గట్లను పటిష్టపరుస్తూ ఉపాధి పనులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పంట బోదెల పూడిక తీత పనులు కూడా నిర్వహిస్తున్నామన్నారు. నాణ్యతాప్రమాణాలతో కచ్చితమైన కొలతలతో పనులను చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శైలజ, ఫీల్డు అసిస్టెంట్‌లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

4నుంచి నృసింహస్వామి జయంత్యుత్సవాలు



స్వయంభూగా వెలిసిన శ్రీలక్ష్మీ నృసింహస్వామి

జుజ్జువరం(పామర్రు): అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, ఆది మధ్యాంత రహితుడు కోరిన వారికి కొంగు బంగారమై వెలుగొందుతున్న శ్రీనృశింహస్వామి ఆలయ జయంతి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. సుమారు 400 సంవత్సరాల క్రితం గ్రామంలోని వ్యవసాయదారుడైన కలకోటి నరసారెడ్డి దంపతుల ఇంట్లో తవ్వకాల్లో స్వయంభుగా వెలసిన శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని గ్రామస్తుల సహకారంతో అక్కడే ఆలయం నిర్మించి ప్రతిష్ఠించారని ప్రతీతి. ఆ తర్వాత గ్రామస్తులు అందరూ కలిసి నృశింహ స్వామి పక్కనే రాజ్యలక్ష్మీ అమ్మవారి విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. నాటి నుంచి నేటి వరకు ఆలయంలో నిత్య ధూప దీప నైవేద్యాల కైంకర్యాలను స్వామివారికి ఆలయ అర్చకులైన రొంపిచర్ల వంశస్తులు నిర్వహిస్తూ ఉన్నారు. మే నెల 4వ తేదీ నుంచి నృసింహ స్వామి జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని రంగురంగులతో విద్యుద్దీపాలతో తీర్చిదిద్దుతున్నారు.

4న శాంతి కల్యాణం

మే నెల 4వ తేదీ వైశాఖ శుద్ధ చతుర్దశి గురువారం ఉదయం స్వామివారికి విశేష మూలా చతుర్దశ కలశ స్నపన, పెండ్లికుమారునిగా చేయటం, రాత్రి 7గంటలకు స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 5వ తేదీ మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం 7 గంటల నుంచి స్వామివారి నృసింహ సేవ(కోలలు), గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది. 6వ తేదీ ఉదయం విశేష నారసింహ వ్రతాలు జరుగుతాయని, సాయంత్రం స్వామివారికి పవళింపు సేవలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు.

మృతుని కుటుంబానికి వైద్యవిద్యార్థిని ఆర్థిక సాయం

ముదినేపల్లిరూరల్: బాధిత కుటుంబానికి వైద్య విద్యార్థిని మంగళవారం ఆర్థిక సాయం అందజేసింది. మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాధ్రిపాలెంకు చెందిన చిల్లిముంత నాగమల్లేశ్వరరావు పక్షవాతంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ముదినేపల్లికి చెందిన ప్రముఖ వైద్యుడు అంబుల మనోజ్ కుమార్తె, వైద్య విద్యార్థిని వైష్ణవి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మట్టి ఖర్చులకు రూ.5 వేలు సాయం అందజేసింది.

పాలపర్రులో పారిశుద్ధ్య పనులు

ముదినేపల్లిరూరల్: మండలంలోని పెదపాలపర్రులో మంగళవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహించారు. మండలంలో కరోనా వ్యాప్తి నిరోధక చర్యల్లో భాగంగా ప్రధాన వీధుల్లో యంత్ర సాయంతో శానిటైజేషన్ చేశారు. రోడ్ల వెంబడి బ్లీచింగ్ చల్లించారు.కార్యక్రమంలో సర్పంచ్ గంటా రాకేష్, ఉపసర్పంచ్ గన్నమనేని వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి షహనాజ్ బేగం, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రూ.7.50 లక్షలకు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం

పామర్రు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి చికిత్స నిమిత్తం రూ.7.50 లక్షల సీఎంఆర్ఎఫ్ నిధులకు మంగళవారం ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మంజూరుపత్రం అందజేశారు. పామర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ధనాల నాగేంద్ర, కృపావతి దంపతుల కుమారుడు విద్యాసాగర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడైన రెల్లి సామాజిక వర్గానికి చెందిన నాగేంద్ర ఆర్థిక పరిస్థితిని గుర్తించి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తాను వ్యక్తిగతంగా కొంత ఆర్థిక సహాయం చేయడమే కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి ప్రభుత్వం తరఫున మణిపాల్ ఆస్పత్రిలో జాయిన్ చేయించారు. మెరుగైన వైద్యం నిమిత్తం రూ.7.50 లక్షల ఎల్‌ఓసీ ఆర్డర్ అందజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, పామర్రు శాసనసభ్యుడు కై లే అనిల్‌కుమార్‌కు నాగేంద్ర ధన్యవాదాలు తెలియజేశారు.

లైఫ్‌గార్డ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని స్విమ్మింగ్ పూల్స్‌లో తాత్కాలిక పద్ధతిన లైఫ్ గార్డ్‌లు(4 ఖాళీలు) భర్తీకి, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వీఎంసీ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్, ఇన్‌చార్జి టి.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కనీస విద్యార్హత పదో తరగతి ఉండాలని, 18 నుంచి 40 ఏళ్ల వయస్సు, స్పోర్ట్స్ ఆథారిటీ లేదా మరేదైనా సంస్థ నుంచి స్విమ్మింగ్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. వీటితో పాటు ఆ విభాగంలో మూడేళ్ల అనుభవం, ఏదైనా రాష్ట్ర, జాతీయ పోటీల్లో ఆడిన అనుభవం ఉండాలని ఆయన పేర్కొన్నారు. నెలకు రూ.12 వేలు గౌరవ వేతనం ఇస్తామన్నారు. ఆయా అర్హతలు కలిగిన అభ్యర్థులు అన్ని వివరాలతో ఉన్న తమ బయోడేటాను, అర్హత సర్టిఫికెట్లను జతపరచి బందరురోడ్డులోని దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలోని స్పోర్ట్స్ విభాగంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం డాల్ఫిన్ పాలిమర్స్ కంపెనీలో అగ్ని ప్రమాదాలపై కైకలూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. సిబ్బంది ఎం.రాంభాస్కర్, ఎం.పరశురాముడు, సీహెచ్ గణేష్, డి.రవీంద్రబాబు, వి.అంజిబాబు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరులో చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పోస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. సంతమార్కెట్ వద్ద నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం సేవానిరతిని కొనియాడారు. అనంతరం లక్కోజు సురేష్ ఆర్థిక సాయంతో తయారుచేసిన మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరి నవరత్న కుమారి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు జంపన కొండరాజు, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి, నాయకులు పేటేటి వీరభద్రాచారి, పాండు, పట్నాల శ్రీను, టేకి వెంకట సత్యనారాయణ, నరసింహరాజు, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



జనార్ధనపురంలో పనులు చేస్తున్న కార్మికులు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని మండల మేనేజర్ సుధాకర రెడ్డి తెలిపారు. వేసవి కాలం కావడంతో వాతావరణం అనుకూలంగా ఉందని, ప్రతి గ్రామంలోనూ ఈ పనులు పుంజుకున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామాల్లో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతిరోజు సగటున 2,200 మందికి ఉపాధి పనులు సమకూరుస్తున్నామని ఆయన తెలిపారు. 100 రోజుల పనికి కావలసిన ప్రణాళిక సిద్ధంగా ఉందని నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి ఉంటుందన్నారు.

వరి కుప్పలకు నిప్పు పెట్టిన దుండగులు

2.10 ఎకరాల్లో వరి పంట దగ్ధం

కోడూరు: రైతు ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంటకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటన కోడూరు మండలంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన చిట్టిప్రోలు రాజ్‌కుమార్ అదే గ్రామంలో ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని ఖరీఫ్ సీజన్‌లో వరిపంటను సాగు చేశాడు. పంట చేతికి రావడంతో ఈ ఏడాది జనవరి నెలలో రాజ్‌కుమార్ వరికోత కోసి ఆరు ఎకరాల్లోని పంటను ఐదు వరికుప్పలుగా వేశాడు. అనంతరం రబీ పంటలో మినుము సాగు చేయగా ఇటీవల కాయ తీత పూర్తి చేశాడు. మరో రెండు రోజుల్లో వరికుప్పలను నూర్పిడి చేసేందుకు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు రాజ్‌కుమార్‌కు సంబంధించిన రెండు వరికుప్పలకు నిప్పు పెట్టారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి చూడగా 2.10 ఎకరాలకు సంబంధించి వేసిన రెండు వరికుప్పలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లింది.

నాలుగేళ్లుగా ఇదే విష సంస్కృతి..

లింగారెడ్డిపాలెం పంచాయతీలో నాలుగేళ్లుగా ఇలా వరికుప్పలకు నిప్పు పెట్టే విష సంస్కృతి నడుస్తోంది. పంచాయతీ పరిధిలోని నక్కవానిదారి గ్రామంలో మూడేళ్లుగా పలువురు రైతుల వరికుప్పలకు గుర్తుతెలియని దుండగులు నిప్పు పెడుతూనే ఉన్నారు. ఈ ఏడాది లింగారెడ్డిపాలెం గ్రామంలో వరికుప్పకు నిప్పు పెట్టిన ఘటన దివిసీమ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

నవధాన్యాల సాగు.. నేల తల్లికి బాగు



వేమవరప్పాడులో ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ

కైకలూరు: నవధాన్యాల సాగుతో నేలలో పోషక విలువలు పెరుగుతాయని ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ పి.గౌతంకుమార్ అన్నారు. రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక 2023–24 ఏడాదికి ప్రకృతి వ్యవసాయంపై వేమవరప్పాడు గ్రామంలో రైతులతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతంకుమార్ మాట్లాడుతూ పంటకు ముందుగా పచ్చిరొట్ట పైర్ల పెంపకం అత్యవసరమన్నారు. రసాయనాలు లేని వ్యవసాయ పద్ధతులు మేలని వివరించారు. పలు వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్న రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వీఏఏ గోపీనాథ్, వీఓఏ ప్రసన్న, ఐసీఆర్‌పీలు అహోబలరావు, రామాంజనేయులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణ చర్యలను చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

కురుమద్దాలి(పామర్రు): వేసవిలో తరచూ జరిగే అగ్ని ప్రమాదాలను నివారించేలా తగు చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి ఎస్.రాంబాబు అన్నారు. మండలంలోని కురుమద్దాలి గ్రామంలో రాణి ఆక్వా ఆవరణలో మంగళవారం అగ్ని ప్రమాదాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలలో ప్రమాదం జరిగినప్పుడు వెంటనే సైరన్ మోగించాలని అన్నారు. సిబ్బందికి ధైర్యం చెబుతూ ప్రమాదం నుంచి దూరంగా తీసుకువెళ్లాలన్నారు. నివాసగృహాలలో ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను కార్బన్ డైయాక్సైడ్ సహాయంతో ఆర్పివేయాలన్నారు. ఎత్తయిన ప్రదేశాలలో ప్రమాదం జరిగితే ఏ విధమైన చర్యలు తీసుకోవాలో వివరించారు. గ్యాస్ లీక్ అయిన సమయాలలో కంగారు పడకుండా ముందు గ్యాస్ బండను కట్టి వేయాలని, లేని పక్షంలో కార్బన్ డైయాక్సైడ్‌తో మంటలను ఆర్పివేయాలన్నారు. మంటలు ఆర్పే విధానాన్ని రాణి ఆక్వా సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, రాణి ఆక్వా ఉద్యోగులు పాల్గొన్నారు.

సంతృప్తికరంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డీఎన్నార్



కోరుకొల్లు గ్రామంలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కై కలూరు(కలిదిండి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు–1, 2 సచివాలయాల పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ పాలనకు నేడు సీఎం జగన్ ప్రజారంజక పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఇంటి తలుపులకు, సెల్ ఫోన్లకు జగన్ స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఉపసర్పంచ్ చెన్నంశెట్టి నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అంకెం నరసయ్య, సచివాలయ కన్వీనర్లు చెన్నంశెట్టి సోమేశ్వరరావు, బసవయ్య, శ్రీకాంత్, గరికిముక్కు వనమయ్య, నాయకులు దాసి ఏసుబాబు, వలవల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

• ముంజలు... వేసవిలో ప్రకృతి ప్రసాదాలు



వేసవిలో ప్రజలకు ప్రకృతి ప్రసాదం తాటిముంజలు. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తాయి. చల్లదనమే కాదు.. ఆరోగ్యాన్ని కూడా పంచుతాయి. వీటిని చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారు ఇష్టంగా తింటారు. అంతేకాదు...ఈ సీజన్‌లో తాటి ముంజలను విక్రయిస్తూ ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు.

–పామర్రు